క్లుప్తంగా

ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తర్లుపాడు: మండల పరిషత్ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జయరాజ్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధికారులు స్పందించకుంటే దళిత సంఘాల నాయకులతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కె.కిశోర్‌కుమార్‌ను, ఎస్సై బ్రహ్మనాయుడును కలిసి దళిత మహిళకు న్యాయం చేయాలని కోరారు.

మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలి

రాచర్ల: పాఠశాలల్లోని మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ వారణాసి గిరిధర శర్మ పేర్కొన్నారు. మండలంలోని రాచర్ల, చోళ్లవీడు గ్రామాల్లోని పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసిన తరువాతే విద్యార్థులకు వడ్డించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాల రికార్డులు పరిశీలించిన అనంతరం రాచర్లలోని స్పందన స్కూల్‌ను తనిఖీ చేశారు.

ద్విచక్ర వాహనాలు వేలం



ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కంభం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఒంగోలు డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు కంభం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు శుక్రవారం వేలం నిర్వహించినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. వేలాన్ని మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకట్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి వేలం వేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

28 నుంచి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

దర్శి: 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తుకు తెస్తూ దర్శి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ నెల 28వ తేదీ నుంచి వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. 28వ తేదీన తాళ్లూరు మండలం, 29వ తేదీన దొనకొండ మండలం, 30వ తేదీన కురిచేడు మండలం, 31వ తేదీన ముండ్లమూరు మండలంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలకు పలు పదవుల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బూచేపల్లి విజ్ఞప్తి చేశారు.

సైన్స్, బోటనీపై విద్యార్థులకు అవగాహన

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ సావిత్రి ఆధ్వర్యంలో జరిగిన కెరీర్ ఆపర్చునిటీస్ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ హర్ష భార్గవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ మరియు ఆర్ట్స్ గ్రూపుల్లో ఉన్న బిగ్ డేటా, బోటనీ విభాగంలో మొక్కల్లో ఉన్న ఔషధ గుణాలపై అవగాహన కల్పించారు. స్వయం ఉపాధిలో ఉన్న ప్రభుత్వ సహకారాన్ని వివరించారు. అధ్యాపకులు శ్రీనివాసాచారి, విజయబాబు పాల్గొన్నారు.



తెల్లపాడు-ఆరవల్లిపాడు మధ్య ఇదీ పరిస్థితి

రైతులకు పంట.. ప్రయాణానికి తంటా!

- రోడ్డు మార్జిన్లను దున్నేసి పంటలు సాగు చేస్తున్న రైతులు
- చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు
- వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

కొనకనమిట్ల:

ప్రధాన రహదారుల వెంట భూములున్న రైతులు మార్జిన్లను క్రమంగా దున్నేసి చదును చేస్తుండటం వాహనదారుల ప్రాణాలమీదకు తెస్తోంది. తమ భూములను ఆనుకుని ఖాళీగా ఉన్న మార్జిన్‌ను కూడా సాగులోకి తెస్తే పంట దిగుబడి పెంచుకోవచ్చన్న ఆశతో రైతులంతా ఒకరిని చూసి ఒకరు అదే పనిచేస్తున్నారు. అయితే జరగబోయే నష్టం, వాహనదారులకు కలిగే ఇబ్బందులపై రైతులకు అవగాహన కల్పించి మార్జిన్ల ఆక్రమణను అడ్డుకోవాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. కొనకనమిట్ల మండలంలోని పలు రహదారుల వెంట ఉన్న భూముల యజమానులు మార్జిన్లు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. రహదారి వెంట రెండు వైపులా 10 అడుగుల మేర సైడ్ మార్జిన్ ఉంటుంది. అయితే మండల పరిధిలోని దొనకొండ రోడ్డులో పలు చోట్ల రోడ్డు మార్జిన్లను పూర్తిగా ఆక్రమించి చదును చేశారు. ముఖ్యంగా దొనకొండ వెళ్లే రహదారిలో నాగరాజుకుంట, మునగపాడు, ఆరవల్లిపాడు గ్రామాల మధ్యలో రోడ్డు మార్జిన్‌ను పొలాల్లో కలిపేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే నాగంపల్లి, చినారికట్ల, సిద్ధవరం, మునగపాడు ఎస్సీ కాలనీ నుంచి పొలాలకు వెళ్లే బండ్లబాటను కూడా పక్కన పొలాలకు సంబంధించిన వారు క్రమంగా దున్నేస్తుండటంపై తోటి రైతులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొనకనమిట్ల-ఎదుర్రాళ్లపాడు మార్గంలో కూడా రోడ్డు మార్జిన్లు ఆక్రమించుకుని చదును చేస్తున్నారు.



మునగపాడు-నాగరాజుకుంట మధ్యలో రోడ్డు మార్జిన్ దున్నిన దృశ్యం

ప్రమాదాలకు బాధ్యులెవరు?

కుంచించుకుపోయిన రహదారుల వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వాహనాలు ఎదురుపడితే పక్కకు తొలిగేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడం రివర్స్ తీయాల్సి వస్తోంది. వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో రోడ్డు మార్జిన్లు సరిగా లేనిచోట ప్రమాదాలకు గురయ్యే అవకాశం అధికంగా ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లను పూర్వ స్థితికి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.



మునగపాడు ఎస్సీ కాలనీ నుంచి పొలాలకు వెళ్లే రోడ్డు ఇలా..

అక్షరం నేర్వాలంటే.. అడుసు తొక్కాలి.. కాలు కడగాలి!



బురదమయంగా మారిన యడవల్లి ప్రాథమిక పాఠశాల ప్రాంగణం

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రాంగణం బురదమయంగా మారడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కాలంలో మట్టి తోలి మెరక చేయించినా గడచిన నాలుగు రోజులుగా కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు పాఠశాల ప్రాంగణం బురదమయంగా మారింది. బురదమట్టిని తొక్కుకుంటూ తరగతి గదిలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో తాగునీటి ట్యాంకు ఉండటంతో వృథా నీరంతా చేరి ప్రాంగణంలో బురద ఆరడం లేదు. ఇప్పటికై నా అధికారులు చర్యలు తీసుకుని పాఠశాల ఆవరణను బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పొదిలి రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృందం సభ్యులు ప్రభాత్‌శర్మ, నందలాల్ గుల్జార్ సూచించారు. శుక్రవారం పొదిలి మండలంలోని ఆముదాలపల్లిలో పలు పనులను పరిశీలించారు. బ్యాంకు రుణాలతో డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అర్హత ఉండి పింఛను రానివారు ఎవరైనా ఉంటే తెలియజేయాలని కోరారు. అనంతరం సీసీ రోడ్లు, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

మెనూ చార్జీలు పెంచాలి

కంభం: పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జీఆర్‌ఆర్ అండ్ టీపీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ అధ్యక్షతన మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం తయారీకి ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, కార్మికులకు రెండు జతల యూనిఫాం అందించాలని, పేరెంట్స్ మీటింగ్, ఇతర సమావేశాల రోజు పెట్టిన భోజనాలకు బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, హైస్కూల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.12 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా సరళ, కేతువురాలు, ఉపాధ్యక్షురాళ్లుగా మహాలక్ష్మి, సీత తదితరులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్పన

విద్యాశక్తితో మానసిక సమస్యలు

మార్కాపురం: ఉన్నత పాఠశాలల్లో విద్యాశక్తి విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన రాయవరం, గజ్జలకొండ, తూర్పుపల్లి, గోగులదిన్నె తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. ఎర్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలాడుకోవాల్సిన సమయంలో బలవంతంగా పాఠశాలల్లో కూర్చోబెట్టి చదివించడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, విద్యాశక్తి విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, ప్రభాకర్‌రావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు



కొనకనమిట్ల రామధూత క్షేత్రంలో..



గిద్దలూరులో ప్రత్యేక అలంకరణలో గాయత్రిమాత



మార్కాపురంలో భక్తులకు దర్శనమిస్తున్న జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్/గిద్దలూరు రూరల్/కొనకనమిట్ల: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారిని అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయశర్మ ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- కొనకనమిట్ల మండలంలోని వెలుగొండస్వామి క్షేత్రం, రామదూత క్షేత్రం, రేగడపల్లి వెంకటేశ్వర స్వామి, గొట్లగట్టు రామాలయం, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో శ్రావణ శుక్రవార, శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. భక్తులకు శ్రావణ మాస విశిష్టతను వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు, విజయకాంత్‌శర్మ వివరించారు.
- గిద్దలూరులోని గాయత్రిమాత ఆలయం, నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయం, వీరన్నబావి సమీపంలో కాళికాంబ ఆలయం, పెద్ద బజారులో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గమ్మ ఆలయానికి నల్లబండ బజారు నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పొదిలి: పొదిలి-మార్కాపురం రోడ్డులో మాదాలవారిపాలెం సమీపంలో శుక్రవారం రాత్రి సంభవించిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్కూటీ-మోటారు సైకిల్ ఎదురెదురుగా ఢీకొనడంతో కొనకనమిట్ల మండలం మునగపాడు గ్రామానికి చెందిన శివరాత్రి శివ, కొనకనమిట్ల మండల కేంద్రానికి చెందిన పోతిపోగు రవి, ముండ్లమూరి అఖిల్‌రాజ్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శివను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు బంధువులు తెలిపారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న రవి



సంఘటన స్థలంలో క్షతగాత్రుడు శివ

ఇలాగైతే నడిచేదెలా?



నాగులవరం రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షం నీరు

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ప్రధానంగా నాగులవరానికి వెళ్లే మార్గంలో సాగర్ పైపుల ఏర్పాటుకు పది రోజుల క్రితం అధికారులు రోడ్డుకు ఒకవైపు తవ్వి వదిలేశారు. సింగిల్ రోడ్డు కావడంతో పెద్ద వాహనాలు వస్తే పక్కకు తొలిగేందుకు కూడా అవకాశం లేక తంటాలు పడుతున్నారు. ఇదే రోడ్డులో హాస్టల్ దాటిన తర్వాత గుంతలు పడి వాననీరు నిలవడంతో రాకపోకలకు సమస్యగా మారింది. వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణించే ఈ మార్గంలో పైపులైన్ల ఏర్పాటును త్వరగా పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



నాగులవరం మార్గంలో రోడ్డుపైనే ఉన్న మట్టి

హైవేపై జంతు వధ.. అందరికీ వ్యథ!



రోడ్డుపైనే జీవాలను వధిస్తున్న వ్యాపారులు



హైవే సర్వీస్ రోడ్డుపై గుంపులుగా చేరి మాంసం కొనుగోలు



హైవేపై తోపుడు బండ్ల మీద మాంసం విక్రయం

బేస్తవారిపేట: మండల కేంద్రమైన బేస్తవారిపేటలో మాంసం విక్రయానికి ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో జాతీయ రహదారినే వ్యాపారులు తాత్కాలిక వసతిగా మార్చుకున్నారు. మటన్‌తోపాటు చేపలను రోడ్డు మార్జిన్‌లో ఉంచి విక్రయిస్తుండటతో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని కొనుగోలుదారులు సైతం ఆందోళన చెందుతున్నారు. హైవేకు ఇరువైపులా గొర్రెలు, పొట్టేళ్లను వధిస్తుండటం, చేపలను కూడా అక్కడే ముక్కలు చేసి ఇస్తుండటంతో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. నిత్యం వాహనాలు తిరిగే హైవే కావడంతో దుమ్ము, పొగ మాంసంపై చేరుతోంది. అధికారులు, పంచాయతీ సిబ్బంది సైతం ఆదివారం వస్తే ఇక్కడే మాంసం కొనుగోలు చేస్తున్నారు కానీ వ్యాపారులకు వసతి కల్పించాలని ఆలోచన చేయకపోవడం కొసమెరుపు.